


https://epaper.tharangalu.in

RNI. TELTEL / 2022 / 83463

జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
సోమవారం
31 ఆగస్టు 2026
సంపుటి 03
సంచిక 322
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh

Epaper: www.tharangalu.in.com

# రష్యాకు భారత్ పెట్రోల్ ఎగుమతి

- డ్రోన్ దాడులతో రిఫైనరీలకు దెబ్బ
- 10 లక్షల బ్యారెళ్ల సరఫరా చేసిన భారత్...
- ముడి చమురు దిగుమతిదారుగా.. పెట్రోల్ ఎగుమతిదారుగా భారత్ వ్యూహాత్మక ఎదుగుదల



న్యూఢిల్లీ, ఆగస్టు 30 (తరంగాలు ప్రతినిధి): అంతర్జాతీయ ఇంధన మార్కెట్లో అరుదైన పరిణామం చోటుచేసుకుంది. సాధారణంగా రష్యా నుంచి భారీగా ముడి చమురు దిగుమతి చేసుకునే భారత్.. ఇప్పుడు అదే దేశానికి పెట్రోల్ ఎగుమతి చేసే కీలక దేశంగా అవతరించింది. ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో రష్యాలోని పలు చమురు శుద్ధి కర్మాగారాలు దెబ్బతినడంతో దేశీయ ఇంధన ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో రష్యా తన అవసరాలను తీర్చుకునేందుకు విదేశాల నుంచి పెట్రోల్ దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వోర్టెక్సా అనే అంతర్జాతీయ ఎనర్జీ అనలిటిక్స్ సంస్థ వివరాల ప్రకారం.. గత రెండు నెలల్లో రష్యా రిఫైనరీలపై సుమారు 32 డ్రోన్ దాడులు జరిగాయి. వీటి ప్రభావంతో దేశీయ పెట్రోల్ ఉత్పత్తి గణనీయంగా తగ్గినట్లు అంచనాలు ఉన్నాయి. ఇంధన కొరత కారణంగా రష్యాలోని పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు భారీగా బారులు తీరాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు రష్యా ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో భారత్ రష్యాకు పెట్రోల్ సరఫరా చేస్తోంది. జూలై, ఆగస్టు నెలల్లో భారత్ నుంచి దాదాపు 10 లక్షల బ్యారెళ్ల పెట్రోల్ రష్యాకు ఎగుమతి అయినట్లు వాణిజ్య వర్గాలు వెల్లడించాయి. భారత్‌తో పాటు తుర్కియే, మొరాకో కూడా రష్యాకు

➤ మిగతా 2వ పేజిలో..



# 2030 నాటికి 5 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం

- భారత్--ఉజ్బెకిస్తాన్ మధ్య విస్తృత సహకారానికి అడుగులు
- మోదీ పర్యటనలో కీలక ఒప్పందాలు.. బంధానికి కొత్త బలం
- సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా అప్‌గ్రేడ్
- మౌలిక వసతులు, కృత్రిమ మేధలో సహకారం విస్తరణ
- ప్రధాని నరేంద్ర మోదీ

తాష్కెంట్, ఆగస్టు 30 (తరంగాలు ప్రతినిధి): భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్కత్ మీర్జియోయేవ్ మధ్య తాష్కెంట్‌లో జరిగిన ద్వైపాక్షిక చర్చలు కీలక ఫలితాలను ఇచ్చాయి. ఇరు దేశాల మధ్య ఉన్న సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తూ వాటిని సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం ద్వారా రాజకీయ, ఆర్థిక, సాంకేతిక, భద్రతా రంగాల్లో సహకారం మరింత బలోపేతం కానుంది. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించేందుకు ఇరు దేశాలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికపై దృష్టి సారించాయి. ప్రస్తుతం ఉన్న వాణిజ్య స్థాయిని గణనీయంగా పెంచుతూ 2030 నాటికి 5 బిలియన్ డాలర్లకు పైగా వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్ణయించారు. ఇందుకోసం

➤ మిగతా 2వ పేజిలో..



# హైదరాబాద్--బీజాపూర్ హైవే పనుల పరిశీలన

- చేవెళ్ల సమీపంలో పనుల పురోగతిపై సమీక్ష
- రోడ్డు మౌలిక వసతుల బలోపేతమే కేంద్ర లక్ష్యం
- తెలంగాణ అభివృద్ధికి కనెక్టివిటీ కీలకం
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

➤ 2వ పేజిలో..

# కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి..

- అసలు విషయం చెప్పిన మహేశ్ గౌడ్
- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి హామీ ఇచ్చింది వాస్తవమేనన్న టీపీసీసీ చీఫ్
- రాజకీయ సమీకరణాల వల్లే పదవి ఇవ్వడంలో ఆలస్యం జరిగిందని వెల్లడి
- సెప్టెంబర్ నాటికి పార్టీలోని అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ధీమా
- అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీపై వచ్చే నెలలో స్పష్టత
- కాంగ్రెస్ ఒక మహాసముద్రమని, అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ ఉంటుందని వ్యాఖ్య



హైదరాబాద్, ఆగస్టు 30 (తరంగాలు ప్రతినిధి): తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత పరిణామాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది నిజమేనని ఆయన అంగీకరించారు. అదే సమయంలో, పార్టీలో నెలకొన్న చిన్న చిన్న అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలన్నీ సెప్టెంబర్ నాటికి కొలిక్కి వస్తాయని స్పష్టం చేశారు.

పార్టీలోని నాయకుల అసంతృప్తిపై మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ ఒక మహాసముద్రం లాంటిది. ఇక్కడ నాయకులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది. అయితే, అదే సమయంలో పార్టీ క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యం" అని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చామని, అయితే కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా ఆలస్యం జరిగిందని వివరించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు ఓపిక చాలా అవసరమని ఆయన సూచించారు. మంత్రులు కొండా సురేఖ, చిన్నారెడ్డి వంటి నేతల విషయంలో నెలకొన్న వివాదాలపై అడిగినప్పుడు, ఆ అంశాలను పార్టీ అధిష్ఠానం

➤ మిగతా 2వ పేజిలో..

# కేరళలో చికిత్స... ఏపీలో పాలన

- ఫైళ్లపై సమీక్ష.. నిర్ణయాల్లో వేగం
- ప్రజా సమస్యలపై పవన్ నిరంతర పర్యవేక్షణ
- పర్యావరణం నుంచి పుణ్యక్షేత్రాల వరకు ప్రత్యేక దృష్టి



అమరావతి, ఆగస్టు 30 (తరంగాలు ప్రతినిధి): ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వైద్య చికిత్స నిమిత్తం కేరళలో ఉన్నప్పటికీ ప్రభుత్వ వ్యవహారాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఈ నెల 22న చికిత్స కోసం కేరళకు వెళ్లిన ఆయన అక్కడి నుంచే శాఖల పనితీరును సమీక్షిస్తూ,

➤ మిగతా 2వ పేజిలో..



# సిద్ధాంతాలతో ముందుకెళ్తున్న బీజేపీ ప్రయాణం

- కుటుంబ రాజకీయాలకు భిన్నమని వ్యాఖ్య
- వాజ్‌పేయి, మోదీ నాయకత్వాన్ని ప్రస్తావన
- రామమందిరం, ఆర్టికల్ 370పై ప్రశంసలు
- ప్రజాస్వామ్య విలువలే పార్టీ బలం
- ఎంపీ ఈటెల రాజేందర్

➤ 2వ పేజిలో..

# రాజీనామా చేయిస్తారు!

- కొండా సురేఖను సామరస్యంగా..ఇంటికి పంపించే యోచనలో అధిష్ఠానం!
- చిన్నారెడ్డిని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవికి రాజీనామా కోరే చాన్స్
- వారంలోనే నిర్ణయం.. తద్వారా పార్టీలోని ఇతర నేతలకు గట్టి సంకేతాన్నిచ్చే యోచన
- నేడు అమెరికా నుంచి వేణుగోపాల్ రాక
- రేపు ఢిల్లీకి వెళ్లనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- తుమ్మిడిహెట్టిపై సీడబ్ల్యూసీ భేటీలో పాల్గొననున్న సీఎం, ఉత్తమ్

హైదరాబాద్, ఆగస్టు 30 (తరంగాలు ప్రతినిధి): మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిలపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించి కాంగ్రెస్ అధిష్ఠానం ఈ వారంలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాలకు ముందుగానే దీనికి ఒక ముగింపు పలకాలన్న భావనలో ఉన్నట్లు సమాచారం. కొండా సురేఖ, చిన్నారెడ్డిపై కఠినంగానే చర్యలు తీసుకుని.. క్రమశిక్షణ విషయంలో మిగిలిన నాయకులకు స్పష్టమైన సంకేతాన్నివ్వాలన్న యోచనలో అధిష్ఠానం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించడం కాకుండా.. మంత్రి పదవికి రాజీనామా చేయాల్సిందిగా ఆమెను కోరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చిన్నారెడ్డిని సైతం ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని కోరే అవకాశం ఉందంటున్నారు.

మరోవైపు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టి కొత్తవారికి అవకాశం ఇచ్చే పేరుతో కొండా సురేఖను తప్పిస్తారన్న ప్రచారం కూడా ఉంది. కానీ, క్రమశిక్షణ విషయంలో



అధిష్ఠానం కఠినంగా ఉందని సంకేతాలు ఇవ్వదలచుకుంటే మాత్రం రాజీనామా కోరే అవకాశాలే ఎక్కువగా ఉంటాయని అంటు న్నారు. కఠిన చర్యలు తీసుకోని పక్షంలో సీఎం రేవంత్‌రెడ్డిని, ఆయన నేతృత్వంలోని ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీని బలహీనప రిచినట్లే అవుతుందన్న భావనకు అధిష్ఠానం వచ్చినట్లు చెబుతున్నారు. ఈ విషయంలో ఉపేక్షిస్తే భవిష్యత్తులో ప్రతి చిన్న అంశానికీ పార్టీ, ప్రభుత్వ నాయకత్వాలపై విమర్శలు చేసేవారు

➤ మిగతా 2వ పేజిలో..

జాతీయ దిన పత్రిక

# తరంగాలు

THARANGALU DAILY NEWS

సోమవారం, 31 ఆగస్టు , 2026



## రష్యాకు భారత్ పెట్రోల్ ఎగుమతి

ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో భారత్ రష్యాకు పెట్రోల్ సరఫరా చేస్తోంది. జూలై, ఆగస్టు నెలల్లో భారత్ నుంచి దాదాపు 10 లక్షల బ్యారెళ్ల పెట్రోల్ రష్యాకు ఎగుమతి అయినట్లు వాణిజ్య వర్గాలు వెల్లడించాయి. భారత్‌తో పాటు తుర్కియే, మొరాకో కూడా రష్యాకు ఇంధనాన్ని సరఫరా చేస్తున్నాయి. గుజరాత్‌లోని వడినార్‌లో ఉన్న నయారా ఎనర్జీ రిఫైనరీ నుంచే ఈ ఎగుమతుల్లో అధిక భాగం జరిగినట్లు సమాచారం. ఈ రిఫైనరీలో రష్యా ప్రభుత్వ రంగ సంస్థ రాస్‌నెఫ్ట్‌కు వాటా ఉండటం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది.

### రిఫైనింగ్ సామర్థ్యంపై భారత్ దృష్టి

ప్రపంచంలో మూడో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా ఉన్న భారత్.. తన శుద్ధి సామర్థ్యాన్ని మరింత పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఉన్న 272 మిలియన్ మెట్రిక్ టన్నుల వార్షిక రిఫైనింగ్ సామర్థ్యాన్ని 300 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెంచే చర్యలు కొనసాగుతున్నాయి. దీంతో భారత్ ఆసియాలోనే కాకుండా ప్రపంచ ఇంధన మార్కెట్లోనూ కీలక రిఫైనింగ్ కేంద్రంగా ఎదుగుతోందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి పేర్కొన్నారు.

### 27 దేశాల నుంచి 41 దేశాలకు..

అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ పరిస్థితులు, హర్మూజ్ జలసంధికి సంబంధించిన ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ తన ముడి చమురు దిగుమతి వనరులను కూడా విస్తరించింది. గతంలో 27 దేశాల నుంచి ముడి చమురు దిగుమతి చేసుకున్న భారత్.. ప్రస్తుతం 41 దేశాల నుంచి చమురు కొనుగోలు చేస్తోంది. ప్రపంచ మార్కెట్లో అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ దేశ ఇంధన భద్రతకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

అయితే భారత్ ముడి చమురు దిగుమతుల్లో రష్యా ప్రాధాన్యం మాత్రం కొనసాగుతోంది. కెప్లర్ డేటా ప్రకారం ఆగస్టులో రష్యా నుంచి భారత్‌కు వచ్చిన ముడి చమురు దిగుమతులు స్వల్పంగా తగ్గి రోజుకు 2.1 మిలియన్ బ్యారెళ్ల స్థాయికి చేరుకున్నాయి. అయినప్పటికీ మొత్తం దిగుమతుల్లో దాదాపు 40 శాతం వాటాతో రష్యానే భారత్‌కు అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా కొనసాగుతోంది.

ఒకవైపు రష్యా నుంచి ముడి చమురు దిగుమతి చేసుకుంటూనే.. మరోవైపు అదే దేశానికి శుద్ధి చేసిన పెట్రోల్‌ను ఎగుమతి చేయడం ద్వారా భారత్ తన రిఫైనింగ్ సామర్థ్యాన్ని, అంతర్జాతీయ ఇంధన మార్కెట్లో వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## హైదరాబాద్--బీజాపూర్ హైవే పనుల పరిశీలన

వికారాబాద్, ఆగస్టు 30 వికారాబాద్ పర్యటనకు వెళ్తున్న సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి హైదరాబాద్--బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. చేవెళ్ల సమీపంలోని మల్కాపూర్ వద్ద కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని అధికారులు వివరించగా, పనుల నాణ్యత, వేగంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రోడ్డు మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మెరుగైన రహదారుల ద్వారా ప్రాంతాల మధ్య అనుసంధానం పెరగడంతో పాటు ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు సృష్టించబడుతున్నాయని పేర్కొన్నారు.

తెలంగాణలో జాతీయ రహదారుల విస్తరణ, ఆధునికీకరణ ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పరిశ్రమలు, వ్యాపార రంగాలకు కూడా ఊతం లభిస్తుందని మంత్రి తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య దూరాలు తగ్గి ప్రజలకు ప్రయాణ సౌకర్యం మరింత సులభతరం అవుతుందని చెప్పారు. హైదరాబాద్--బీజాపూర్ హైవే అభివృద్ధి పూర్తయితే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య రాకపోకలు మరింత వేగవంతం అవుతాయని, వాణిజ్య కార్యకలాపాలు విస్తరించేందుకు ఇది దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. రహదారి నిర్మాణ పనులు నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. రహదారి పనుల పురోగతిపై అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించిన ఆయన, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడంలో కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. హైవే అభివృద్ధి పూర్తయిన తర్వాత ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని, ప్రయాణ సమయం తగ్గడంతో పాటు భద్రతాయుత రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు వెల్లడించారు. రహదారి పనుల వేగవంతమైన అమలుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

## ఆగస్టులో 36 శాతం లోటు వర్షపాతం

- ఆగస్టులో 36 శాతం లోటు వర్షపాతం
- 17 జిల్లాల్లో ఇదే పరిస్థితి
- గతేడాది ఇదే నెలలో వదలకుండా వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 30 భారీ వర్షాలు కురవాల్సిన ఆగస్టులో అంతంత మాత్రంగానే వర్షాలు పడటంతో తెలంగాణలో సగానికిపైగా జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. 17 జిల్లాల్లో మైనస్ 29 నుంచి 60శాతం లోటు వర్షపాతం నమోదైంది. కేవలం 16 జిల్లాలోనే సాధారణ వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఏ ఒక్క జిల్లాలోనూ అత్యధిక వర్షపాతం నమోదు కాలేదు. రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం చాలా తీవ్రంగా ఉందని ఇప్పటివరకు నమోదైన వర్షపాతం లెక్కలు వెల్లడిస్తున్నాయి. కాగా ఆగస్టులో రాష్ట్ర సగటు వర్షపాతం 215 మి.మీ. కాగా ఇప్పటివరకు కురిసింది కేవలం 133 మి.మీ. మాత్రమే. అంటే ఈ ఒక్క నెలలోనే 36శాతం లోటు వర్షపాతం నమోదైంది. కాగా గత ఏడాది ఇదే నెలలో వదలకుండా భారీ వర్షాలు కురిశాయి. నిరుడు ఆగస్టులో ఏకంగా 377 మి.మీ. వర్షపాతం రికార్డు అయింది. గత ఏడాది ఇదే నెలతో పోల్చితే ఈ ఏడాది ఆగస్టులో ఏకంగా 65శాతం లోటు వర్షపాతం నమోదైంది. అలాగే ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్ర సగటు వర్షపాతం 565 మి.మీ. కాగా ఈ ఏడాది అది కేవలం 472 మి.మీ.కే పరిమితమైంది. గతేడాది ఇదే సమయానికి అది ఏకంగా 719 మి.మీ. కురిసి రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. హన్మకొండ, వరంగల్, జనగాం, గద్వాల, యాదాద్రి, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్, సూర్యాపేట, ఖమ్మం, వనపర్తి, మహబూబాబాద్, నల్గొండ, ఆదిలాబాద్, నాగర్ కర్నూల్, నారాయణపేట, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

### నేడు, రేపు తేలికపాటి వర్షాలు

తెలంగాణలో కొన్ని చోట్ల సోమ, మంగళ వారాల్లో తేలికపాటి నుంచి కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గడచిన 24 గంటల్లో కరీంనగర్ జిల్లా గంగాధరలో 2.9, పెద్దపల్లి జిల్లా ఎలిగేడులో 2.8 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది.

## 2030 నాటికి 5 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యం



వ్యాపార, పెట్టుబడి అవకాశాలను పెంపొందించడంతో పాటు కొత్త రంగాల్లో భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు అంగీకరించారు. మౌలిక వసతుల అభివృద్ధి, డిజిటల్ ప్రజా సేవల వ్యవస్థ, కృత్రిమ మేధ, కీలక ఖనిజాలు, ఇంధన రంగం, అంతరిక్ష పరిశోధన వంటి భవిష్యత్ అవసరాలకు సంబంధించిన రంగాల్లో సహకారాన్ని మరింత పెంచాలని చర్చల్లో నిర్ణయించారు. ఈ రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాల మార్పిడి ద్వారా పరస్పర ప్రయోజనాలు పొందే అవకాశాలు ఉన్నాయని ఇరు దేశాల నాయకులు అభిప్రాయపడ్డారు. వ్యాపారవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు మార్కెట్ ప్రాప్యతను మెరుగుపరచడంపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. రవాణా అనుసంధానం, వాణిజ్య మార్గాల విస్తరణ, బ్యాంకింగ్ సేవల బలోపేతం, చెల్లింపు వ్యవస్థల అనుసంధానం వంటి అంశాలపై ఇరు దేశాలు కార్యాచరణ చేపట్టనున్నాయి. దీనివల్ల ద్వైపాక్షిక వాణిజ్యానికి మరింత ఊతం లభించనుంది.

భారత్, ఉజ్బెకిస్తాన్ మధ్య చారిత్రక, సాంస్కృతిక సంబంధాలు ఉన్నప్పటికీ ఇటీవల సంవత్సరాల్లో ఆర్థిక, వ్యూహాత్మక సహకారం కూడా వేగంగా విస్తరిస్తోంది. మధ్య ఆసియాలో భారత్ ప్రభావాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ ఒప్పందాలు కీలకంగా మారనున్నాయి. అదే సమయంలో ఉజ్బెకిస్తాన్‌కు కూడా భారత మార్కెట్, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కొత్త అవకాశాలు లభించనున్నాయి. తాష్కెంట్ చర్చల ఫలితంగా ఇరు దేశాల సంబంధాలు కొత్త దశలోకి ప్రవేశించాయని అధికారులు పేర్కొన్నారు. సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, ఇంధనం, అంతరిక్షం సహా అనేక రంగాల్లో సహకారం మరింత విస్తరించనుంది. రాబోయే సంవత్సరాల్లో భారత్--ఉజ్బెకిస్తాన్ సంబంధాలు మరింత బలపడే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి..

చూసుకుంటోందని మహేశ్ గౌడ్ తెలిపారు. పార్టీలో ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే వాటిని కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకుంటామని, సమన్వయంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

సెప్టెంబర్ నెలలో పార్టీలోని సమస్యలన్నీ పూర్తిగా పరిష్కారమవుతాయని, నాయకుల అసంతృప్తి తొలగిపోతుందని, నామినేటెడ్ పదవుల భర్తీ కూడా పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్ గౌడ్ చేసిన ఈ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ విస్తరణపై చర్చ ఊపందుకుంది. సెప్టెంబర్‌లో జరగబోయే కేబినెట్ విస్తరణలో రాజగోపాల్ రెడ్డికి బెర్త్ ఖాయమనే ఊహాగానాలు బలపడ్డాయి.

## రాజీనామా చేయిస్తారు!

పెరుగుతారని భావిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఉభయకుశలోపరిగా వెళ్లాలనుకుంటే మాత్రం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ పేరుతో పక్కన పెట్టే అవకాశం ఉందంటున్నారు.

### ఢిల్లీకి వెళ్లనున్న కీలక నేతలు..

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం రాత్రి లేదా మంగళవారం ఉదయం ఢిల్లీకి వెళ్లనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి సెప్టెంబరు 1న ఢిల్లీలో కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) చైర్మన్ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని పేర్కొంటున్నారు. సీఎంతోపాటు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఢిల్లీకి వెళు తున్నారు. అలాగే మాజీ ఎంపీ కేవీపీ రాంచందర్‌రావు ఆధ్వర్యంలో సెప్టెంబరు 2న జరగనున్న వైఎస్సార్ అవార్డు ప్రదాన కార్యక్రమంలో పాల్గొనేందుకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ కూడా ఢిల్లీకి వెళుతున్నారు. మరోవైపు ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం రాత్రి ఢిల్లీకి చేరుకోనున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ కీలక నాయకత్వం ఢిల్లీలోనే అందుబాటులో ఉండనున్న నేపథ్యంలో కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించి.. కేసీ వేణుగోపాల్ వారి అభిప్రాయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి. అధిష్ఠానం పెద్దలతోనూ చర్చించి.. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభంలోగానే ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటున్నారు. అయితే.. అసెంబ్లీ సమావేశాలకు ముందు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు తెరలేపితే.. అది కొత్త వివాదాలకు దారి తీస్తుందన్న అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా వారంలోపే ఈ అంశానికి ఫుల్‌స్టాప్ పెట్టాలన్న ఆలోచనతో అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది.

## ప్రశ్నించిన విద్యార్థులను శిక్షించడం సరికాదు

- అలాంటి చర్యలు రాజ్యాంగానికి శోభను ఇవ్వవు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఆగస్టు 30: భిన్నాభిప్రాయాలను కలిగిన విద్యార్థులను ప్రశ్నించారనే కారణంగా శిక్షించడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ అన్నారు. స్థిరపడిపోయిన విషయాలతో విభేదించడానికి, ప్రశ్నించడానికి తగిన వేదికగా యూనివర్సిటీలు ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థులు స్వేచ్ఛగా ఆలోచించడం యూనివర్సిటీ స్థాయిలోనే ప్రారంభిస్తారని తెలిపారు. ఢిల్లీలో జరిగిన నేషనల్ లా యూనివర్సిటీ పీజీ విద్యార్థుల 13వ స్నాతకోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. భిన్న దృక్పథాలు, విశ్వాసాలు కలిగిన స్వేచ్ఛా సమాజ నిర్మాణం రాజ్యాంగం లక్ష్యమని, ప్రజా జీవనంలో అసమ్మతికి చోటు ఉన్నప్పుడే అది సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. రాజ్యాంగ రక్షణను పొందే వాక్, భావ, భిన్నాభిప్రాయ స్వేచ్ఛను అసహన మనస్తత్వం నిరాకరిస్తుందని వివరించారు.

## కేరళలో చికిత్స... ఏపీలో పాలన

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సమావేశాలు నిర్వహిస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ అవసరమైన చోట అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నారు. రాష్ట్రంలోని ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధి కోసం చేపట్టిన “గుడి బాట” కార్యక్రమాన్ని పవన్ కళ్యాణ్ సమీక్షించారు. 100కు పైగా పుణ్యక్షేత్రాలకు 205 కిలోమీటర్ల రహదారులను రూ.120 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. పనులు పూర్తయిన తర్వాత నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి మాత్రమే భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే పుట్టపర్తి ప్రాంతంలో ఆలయ రహదారుల అభివృద్ధికి మరో రూ.30 కోట్లు మంజూరు చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న “గ్రేట్ గ్రీన్ వాల్” కార్యక్రమంపై కూడా ఆయన సమీక్ష నిర్వహించారు. 5,499 హెక్టార్లలో 55 లక్షల తాటి విత్తనాలను నాటే లక్ష్యంతో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. విత్తనాల సేకరణ, నాటడం, సంరక్షణ అంశాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపు కోసం రూపొందించిన ఏపీ-గ్రీన్ కార్యాచరణను వేగవంతం చేయాలని సూచించారు. 2047 నాటికి రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించే లక్ష్యంతో జీఐఎస్, జియో ట్యాగింగ్, అగ్రో ఫారెస్ట్రీ, అవెన్యూ ప్లాంటేషన్స్, కాలువ గట్లు, షెల్టర్ బెల్ట్స్, నర్సరీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సిఎస్ఆర్, నాబార్డ్, కార్బన్ ఫైనాన్స్ వంటి వనరులను వినియోగించుకుని నెలవారీ, త్రైమాసిక లక్ష్యాలతో పనులను పర్యవేక్షించాలని సూచించారు. అలాగే ఆదివాసీ ప్రాంతాల్లో “అడవి తల్లి బాట” కార్యక్రమం ద్వారా రహదారి కనెక్టివిటీని మరింత విస్తరించాలని ఆదేశించారు.

పిఠాపురం నియోజకవర్గంలో ఆధ్యాత్మిక, ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారించారు. 24 ఆలయాల పునరుద్ధరణకు రూ.17.06 కోట్లు, టీటీడీ కళ్యాణ మండపానికి రూ.2 కోట్లు, 48 భజన మందిరాల నిర్మాణానికి రూ.11.60 కోట్లు కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే పిఠాపురంలోని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రూ.34 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేసే పనులను సమీక్షించారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో రూ.36.6 కోట్లతో ఏర్పాటు చేస్తున్న క్యాన్సర్ కేంద్రం పనుల పురోగతినీ పరిశీలించారు. అనకాపల్లి జిల్లా కృష్ణంపాలెంలో కాలుష్యంపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి కాలుష్య నియంత్రణ మండలి ద్వారా తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు అనుగుణంగా కాలుష్య నియంత్రణ పరికరాలు ఏర్పాటు చేసే వరకు పరిశ్రమను పునఃప్రారంభించరాదని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తే, చికిత్స కోసం రాష్ట్రానికి దూరంగా ఉన్నప్పటికీ పరిపాలనపై పవన్ కళ్యాణ్ నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారనే విషయం స్పష్టమవుతోందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

## సిద్ధాంతాలతో ముందుకెళ్తున్న బీజేపీ ప్రయాణం

- కుటుంబ రాజకీయాలకు భిన్నమని వ్యాఖ్య
- వాజ్‌పేయి, మోదీ నాయకత్వాన్ని ప్రస్తావన
- రామమందిరం, ఆర్టికల్ 370పై ప్రశంసలు
- ప్రజాస్వామ్య విలువలే పార్టీ బలం
- ఎంపీ ఈటెల రాజేందర్

మేడ్చల్, ఆగస్టు 30 మేడ్చల్ మల్కాజిగిరి (అర్బన్) జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన డి. గిరివర్ధన్ రెడ్డి పదవీ బాధ్యతల స్వీకరణ మహోత్సవం, జిల్లా పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుతో కలిసి ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన పార్టీ సిద్ధాంతాలు, దేశాభివృద్ధి, స్వాతంత్ర్య ఉద్యమం, బీజేపీ రాజకీయ ప్రస్థానంపై విస్తృతంగా మాట్లాడారు. భారతీయ జనతా పార్టీ ఒక వ్యక్తి లేదా కుటుంబానికి చెందిన పార్టీ కాదని, దేశ హితం ప్రధాన లక్ష్యంగా ఏర్పడిన సిద్ధాంత పార్టీ అని స్పష్టం చేశారు. సభలో మాట్లాడిన ఈటెల రాజేందర్, “దేశం ఫస్ట్, పార్టీ నెక్స్ట్, వ్యక్తిగతం లాస్ట్” అనే భావజాలమే బీజేపీ మూల సిద్ధాంతమని పేర్కొన్నారు. పార్టీ తీసుకునే ప్రతి నిర్ణయం దేశ ప్రయోజనాల కోసమే ఉంటుందని, స్వప్రయోజనాల కోసం కాదని చెప్పారు. బీజేపీ ఎన్నికల కోసం మాత్రమే పనిచేసే పార్టీ కాదని, ప్రజల అవసరాలు, దేశ అభివృద్ధి, సామాజిక మార్పుల కోసం నిరంతరం కృషి చేసే ప్రజా కేంద్రిత రాజకీయ సంస్థ అని వివరించారు. ఈ నేపథ్యంలో కొత్త జిల్లా అధ్యక్షుడి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. దేశం 80వ స్వాతంత్ర్య వేడుకలు జరుపుకుంటున్న తరుణంలో గత చరిత్రను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఈటెల పేర్కొన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వం దేశ మౌలిక వసతుల అభివృద్ధికి బలమైన పునాదులు వేసిందన్నారు. స్వర్ణ చతుర్భుజి జాతీయ రహదారి ప్రాజెక్టు, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన వంటి కార్యక్రమాలు దేశ ఆర్థికాభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల అనుసంధానానికి ఎంతగానో దోహదపడ్డాయని చెప్పారు. సంకీర్ణ ప్రభుత్వ పరిమితులు ఉన్నప్పటికీ దేశ ప్రయోజనాలే లక్ష్యంగా వాజ్‌పేయి పనిచేశారని కొనియాడారు.

నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని ఈటెల తెలిపారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం దశాబ్దాల కల సాకారమైందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల ఆకాంక్షను నెరవేర్చడంలో మోదీ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందన్నారు. రామమందిర ఉద్యమం వెనుక ఉన్న నాయకుల త్యాగాలు, కృషిని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 రద్దు దేశ సమైక్యతకు బలమైన నిర్ణయమని ఈటెల అభిప్రాయపడ్డారు. దేశానికి ఒకే జెండా, ఒకే చట్టం ఉండాలనే శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆకాంక్షను మోదీ ప్రభుత్వం కార్యరూపం దాల్చిందన్నారు. దేశ సమగ్రత, జాతీయత భావాలను బలోపేతం చేసే దిశగా తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా వచ్చిన స్వేచ్ఛను దేశ ప్రజలందరికీ సమానంగా అందించాలనే లక్ష్యంతో బీజేపీ పనిచేస్తోందన్నారు. పార్టీ నిర్మాణంలో ప్రజాస్వామ్య విధానాలకు బీజేపీ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు. పార్టీ పదవులు కుటుంబ వారసత్వం ఆధారంగా కాకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎంపిక అవుతాయని చెప్పారు. ప్రధానమంత్రి నుంచి రాష్ట్ర అధ్యక్షుల వరకు ప్రతి నాయకత్వ స్థానానికి సంస్థాగత ప్రక్రియల ద్వారానే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. సిద్ధాంతాలు, క్రమశిక్షణ, దేశభక్తి, ప్రజాసేవ అనే నాలుగు స్తంభాలపై బీజేపీ నిర్మితమైందని, తెలంగాణలో పార్టీ విస్తరణకు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## నేత్రదానంతో మరొకరికి చూపునివ్వవచ్చు

•వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో 41వ నేత్రదాన వారోత్సవాలు



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** నగరంలోని ప్రముఖ కంటి వైద్యశాల వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో 41వ నేత్రదాన వారోత్సవాలను (ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 8 వరకు) పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి యాజమాన్యం విలేకరుల సమావేశం నేత్రదాన అవగాహన ర్యాలీని ఘనంగా చేపట్టింది. ఈ కార్యక్రమానికి నగర మేయర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆస్పత్రి వైద్య బృందం, మేనేజర్లు మరియు సిబ్బందితో కలిసి మేయర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం నిర్వహించిన అవగాహన ర్యాలీలో వారు పాల్గొని, నేత్రదానం యొక్క విశిష్టతను, సమాజంలో దాని ఆవశ్యకతను ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు. మరణానంతరం చేసే నేత్రదానం ద్వారా అంధకారంలో ఉన్న ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపవచ్చని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి నేత్రదాన అవగాహన ప్రచారాన్ని విజయవంతం చేసిన నగర మేయర్ కి వాసన్ ఐ కేర్ ఆసుపత్రి యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది.



# ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- కార్యకర్త కుటుంబాలకు కంటికి రెప్పలా కాపలా
- కుమార్ కాలి సర్జరీకి రూ.1.50 లక్షల ఎల్ఓసీ అందజేత



**హన్మకొండ ప్రతినిధి, ఆగస్టు 30, తరంగాలు :** ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ దేవన్నపేట గ్రామానికి చెందిన నందిపాక కుమార్ (కన్ని) కాలి సర్జరీ కోసం వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజును సంప్రదించారు. స్పందించిన ఎమ్మెల్యే నాగరాజు, కుమార్ చికిత్సకు రూ.1.50 లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరు చేయించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మంజూరైన ఎల్ఓసీ పత్రాన్ని ఆదివారం హన్మకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మెరుగైన వైద్యం చేయించుకుని త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సహాయనిధి ద్వారా అండగా నిలుస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో తనను నమ్ముకున్న ప్రతి కార్యకర్త కుటుంబాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. ఆపత్కాలంలో ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచిన ఎమ్మెల్యే నాగరాజుకు బాధిత కుటుంబ సభ్యులు మన స్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 65వ డివిజన్ అధ్యక్షులు సునీల్, కాంగ్రెస్ నాయకులు పొలపాక అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

- అభివృద్ధి పనులకు వేగం పెంచాలి..నాణ్యతలో రాజీ వద్దు
- నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి
- కుమ్మరిగూడెం, తరాలపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన ఎమ్మెల్యే



**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 30,తరంగాలు :** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని 45వ డివిజన్ పరిధిలోని కుమ్మరిగూడెం, తరాలపల్లి గ్రామాల్లో రూ.1.40 కోట్ల విలువైన రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రస్తుతం కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నామని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 45వ డివిజన్ అధ్యక్షులు కర్ర హరీష్ రెడ్డి, 44వ డివిజన్ అధ్యక్షులు జక్కుల సదానందం, జిల్లా కార్యదర్శి పుల్యాల యాదవ రెడ్డి, మాజీ పాక్స్ చైర్మన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షులు సట్ల సదానందం గౌడ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మంద రమేష్, జిల్లా బీసీ సెల్ నాయకులు గంగపురం వేణుగౌడ్, మహిళా డివిజన్ అధ్యక్షురాలు నర్మెట కృష్ణవేణి, జ్యోతి అమర్నాథ్, గ్రామ శాఖ అధ్యక్షులు బషీర్, వర్ధన్నపేట యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బస్కె ప్రణయ్, మండల యూత్ అధ్యక్షులు కృష్ణ, దాసరి కార్తీక్, అజయ్, గంగపురం ఉదయ్, రవి, రాజు యాదవ్, సీనియర్ నాయకులు యాదగిరి యాదవ్, వేణు యాదవ్, స్వామి, బైరి విశ్వనాథం, దుబ్బాక మోహన్, రాజశేఖర్, ఆరూరి పరమేష్, ఆరూరి సురేష్, ఐలపాక రాజేష్, సదారపు బాలకృష్ణ, యూత్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పీజీ పరీక్ష ప్రశాంతం

- పరీక్ష సెంటర్ ను సందర్శించిన
- జిల్లా కలెక్టర్ బి . చంద్రశేఖర్



**నల్గొండ- ఆగస్టు30, తరంగాలు :** జిల్లాలో నిర్వహించిన నీట్ పీజీ పరీక్ష ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎస్పీఆర్ పాఠశా లలో ఏర్పాటు చేసిన నీట్ పీజీ పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. పరీక్ష కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించి, కేంద్ర ఇన్‌చార్జితో పరీక్ష నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నీట్ పి జి పరీక్షకు మొత్తం 180 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 179 మంది హాజరయ్యారని, ఒకరు గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం ఇంచార్జ్ కలెక్టర్‌కు వివరించారు. పరీక్ష రాస్తున్న అభ్యర్థులకు తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర అన్ని మౌలిక సదుపాయాలు కల్పించారా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసు సిబ్బంది ని ఆదేశించారు. అదనపు సూపరింటిండెంట్ రమేష్ ,ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి,డిఎస్పి శివరాశీమిరెడ్డి ,సిఐ ఆదిరెడ్డి ,పరీక్షల ఇంచార్జ్ ప్రొఫెసర్ ఉపేందర్ కలెక్టర్ వెంట ఉన్నారు.జారీ చేసిన వారు సహాయసంచాలకులు, సమాచార శాఖ నల్గొండ.



# ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన వ్యక్తి

## దుబాకుల శ్రీనివాస్ యాదవ్





- పదవీ విరమణ అభినందన సభలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మేకల మల్లి బాబు యాదవ్, గుజ్జర్లపూడి రాంబాబు షేక్ పతే మహమ్మద్ తోటకూరి శివయ్య

**ఇల్లందు ప్రతినిధి ఆగస్టు 30,** సంవత్సరాల పాటు ఎంతో క్రమశిక్షణతో, ఉపాధ్యాయ వృత్తికి వన్నె తేవడమే కాకుండా సామాజిక కార్యక్ర మాలలో కూడా పాలుపంచుకున్న వ్యక్తి దుబాకుల శ్రీనివాస్ యాదవ్ అని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, కామేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి షేక్ పతే మహమ్మద్ తోటకూరి శివయ్య పేర్కొన్నా రు. ఆదివారం రోజు గార్లలో దుబాకుల శ్రీనివాస్ యాదవ్ పదవీ విరమణ అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ, వ్యక్తిగతంగా తనకు ఎంతో ముఖ్యులని, దుబాకుల ఉపాధ్యాయుడుగా రాకముందు అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వ ర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతి గ్రామం తిరిగి పాలేరు నుండి వాజేడు వెంకటాపురం వరకు తిరిగి గొర్రెల సంఘాలు ఏర్పాటు చేశామని, డిసిసిబి డైరెక్టర్ గా కూడా గతంలో పని చేశారని ముఖ్యంగా ఆయనకు శత్రువులంటూ ఎవరు లేరని, ఉన్నతమైన వ్యక్తిత్వం కలవారని కొనియాడారు. ప్రస్తుతం వారు చేసిన పదవికి విరమణ కాని వారు చేయబోయే కార్యక్రమాలకు విశ్రాంతి లేదని అన్నారు. కాకపోతే ఇన్నాళ్లు గౌరవమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారని, రాబోయే రోజులలో పాత్ర మాత్రమే మారుతుందని మిగతాదంతా సేమ్ టు సేమ్ అని వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో నిండి ఉండాలని మనసారా ఆ భగవంతుని కోరుకుంటున్నట్లు అభినందించారు. ఈ సందర్భంగా దుబాకుల శ్రీనివాస్ - సుభాషిణి దంపతులను పుష్పగుచ్చం అందించి శాలువ తో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో చిత్తారు సింహాద్రి యాదవ్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ దుబాకుల వెంకటేశ్వర్లు, లోడిగ వెంకన్న, ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, శీలం పుల్ల య్య,చంద్రకాని గట్టయ్య, డాక్టర్. చంద్రకాని గురు, ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర జిల్లానాయకులు, బంధువులు మిత్రులు శ్రేయోభిలాషులు తదితరులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీ భద్రావతి దేవి అమ్మవారి ఆలయ నూతన కమిటీ ఎన్నిక

**•యదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి ఆగస్టు 30 తరంగాలు**

వలిగొండ మండల పరిధిలోని గొల్నేపల్లి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ భద్రావతి దేవి అమ్మవారి నూతన ఆలయ కమిటీ ని మాజీ అధ్యక్షులు మిర్యాల శ్రీహరి మరియు చేనేత సహకార సంఘం అధ్యక్షులు తాటి రమేష్ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షులుగా చెలమల్ల కృష్ణ నేత నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మిర్యాల గౌరయ్య,ఈదునూరి లక్ష్మయ్య,జిల్ల చంద్రయ్య, మిర్యాల గోవర్ధన్,మిర్యాల విజయ్,అందే వేణు,మేన రఘుపతి,మిర్యాల రాజు, పావని లింగస్వామి,గడ్డం మచందర్,పద్మశాలి కులబాంధవులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ ఆగస్టు 30:**
కలెక్టరేట్‌లో సోమవారం (ఆగస్టు 31) నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10 గంటలకు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన లిఖితపూర్వక ి ర్యాదులను సమర్పించాలని సూచించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్వీకరించి, పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ప్రజల సౌకర్యార్థం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం, కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంతో పాటు జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లోనూ ప్రజావాణి నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

## నీట్ పీజీ--2026 పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 30, తరంగాలు :**
నర్సంపేటలోని బిట్స్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నీట్ పీజీ--2026 పరీక్షను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తనిఖీ చేశారు. ఈ తనిఖి లో జిల్లా కలెక్టర్ వెంట డియార్వో విజయలక్ష్మి , నర్సంపేట ఆర్డీవో ఉమారాణి సెక్షన్ సూపర్డెంట్ రంజిత్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, పరీక్ష నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. నీట్ పీజీ--2026 పరీక్షకు మొత్తం 132 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 127 మంది హాజరయ్యారని జిల్లా కలెక్టర్ తెలిపారు. పరీక్ష ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా విజయవంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.



# సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి నిరీక్షణ





- ఇల్లందు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది అందుబాటుపై ప్రజల ఆగ్రహం
- ఆర్ఐ, జీపీఓల కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు..
- కౌన్సెలింగ్ సమయానికి సర్టిఫికెట్లు అందక విద్యార్థులకు ఇబ్బందులు
- పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఉన్నతాధికారులకు ప్రజల విజ్ఞప్తి

**ఇల్లందు ప్రతినిధి, ఆగస్టు 30 (తరంగాలు):**
ఇల్లందు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రజలకు నిరీక్షణ తప్పడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుల, ఆదాయ, రెసిడెన్షియల్ తదితర సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలలుగా 'సార్' కార్యక్రమం పేరుతో రెవెన్యూ అధికారులు కార్యాలయానికి దూరంగా ఉంటున్నారని పలువురు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. కార్యక్రమం ముగిసినప్పటికీ కార్యాలయంలో అధికారుల అందుబాటుపై సమస్యలు కొనసాగుతున్నాయని అంటున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో జీపీఓ ఉంటే ఆర్ఐ అందుబాటులో ఉండరని, ఆర్ఐ ఉంటే జీపీఓ కనిపించరని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

### సర్టిఫికెట్లు అందక పనులు నిలిచిపోతున్నాయని ఆవేదన

నిర్ణీత సమయంలో ధ్రువీకరణ పత్రాలు అందకపోవడంతో విద్య, ఉద్యోగం, ఇతర అవసరమైన పనుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు చెబుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు కౌన్సెలింగ్ సమయానికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందకపోవడంతో అవకాశాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల కోసం గంటల తరబడి నిరీక్షణ

దరఖాస్తులు అధికారుల వద్ద పెండింగ్‌లో ఉండటంతో తమ పనులు ముందుకు సాగడం లేదని పలువురు పేర్కొంటున్నారు. సర్టిఫికెట్ల కోసం పలుమార్లు కార్యాలయానికి వచ్చినా సరైన సమాచారం అందడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రత్యేకంగా ఆర్ఐ, జీపీఓల పనితీరుపై పలువురు దరఖాస్తుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### 'మూడు గంటల తర్వాతే అందుబాటులో ఉంటాం' అంటూ బోర్డులు

సర్వేల పేరుతో రెవెన్యూ సిబ్బంది కార్యాలయం వెలుపలికి వెళ్లి వస్తున్నారని, సాయంత్రం మూడు గంటల తర్వాతే అందుబాటులో ఉంటామని బోర్డులు ఏర్పాటు చేయడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉదయం కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుదారులు సర్టిఫికెట్ల కోసం సాయంత్రం ఏడు, ఎనిమిది గంటల వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఉన్నతాధికారులు పర్యవేక్షించాలి

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు నిర్ణీత గడువులో సేవలు అందించాల్సి ఉన్నప్పటికీ, ఇల్లందు తహసీల్దార్ కార్యాలయంలో సర్టిఫికెట్ల జారీలో జాప్యం కొనసాగుతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారికి సర్టిఫికెట్లు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రెవెన్యూ సిబ్బంది కార్యాలయంలో పూర్తిస్థాయి పని సమయాల్లో అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# స్నేహితుని కుటుంబానికి అండగా 96-97 బ్యాచ్ మిత్రులు

**•మిత్రుడి కుటుంబానికి రూ.53,500 ఆర్థిక సాయం**

యాదాద్రి భువనగిరి జిల్లా, ఆగస్టు 30 (తరంగాలు): స్నేహానికి కుటుంబానికి 96--97 బ్యాచ్ మిత్రులు ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు. వలిగొండ మండలం ఆరూరు గ్రామానికి చెందిన రవ్వ సత్యం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఆయన 1996--97 బ్యాచ్‌కు చెందిన తోటి విద్యార్థి మిత్రులు కుటుంబాన్ని పరామర్శించి, తమ వంతు సహాయంగా రూ.53,500 ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ.. రవ్వ సత్యం కుటుంబానికి అండగా నిలిచేందుకు తమ వంతు సహాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండి రవికుమార్, ఆవుల స్వామి, బోగారం స్వామి, కందడి పాండురంగారెడ్డి, లోతుకుంట లక్ష్మణ్, జాడ గణేష్, పల్సాం వెంకటేశం,



పాండాల కుమారస్వామి, దొడ్డి అనిల్ కుమార్, సురుకంటి గణేష్, దామెర నరసింహచారి, చిలకమర్రి ఉపేందర్, రాంపల్లి శేఖర్, జాడ ప్రవీణ్, సల్ల మచ్చగిరి, జినుకల స్వామి, జినుకల ఐలయ్య, కసరబోయిన సోములు, దేశపాక శ్రీనివాస్, పి. కేశవులు, పెద్దిటి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# అన్నాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీక రాఖీ పండుగ



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి ఆగస్టు 30 తరంగాలు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రాఖీ పండగ**

పర్వదినాన్ని పురస్కరించుకొని అక్క తమ్ముళ్ళు ,అన్నా చెల్లెలు,ఒకరికొకరు రాఖీలు కడుతూ,మిఠాయిలు తినిపించుకుంటూ తమ అనురాగాన్ని చాటుకున్నారు. అనంతరం పట్టు వస్త్రాలను పెట్టి వారి దీవెనలు పొందారు. రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలుపుతూ రక్షాబంధన్ విశిష్టతను భారతీయ సంస్కృతిలో అన్నాచెల్లెళ్ల ప్రేమకు,రక్షణకు సంకేతంగా నిలిచే ఈ పండుగ సోదరభావాన్ని పెంపొందిస్తుందని తెలియజేశారు.



# పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం









- అణగారిన వర్గాల కోసం పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్
- ఐడిపీఎల్ చౌరస్తాలో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, ఆగస్టు 30,తరంగాలు** :అణగారిన వర్గాల కోసం పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని కుబ్బిల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు.ఆదివారం ఐడిపీఎల్ చౌరస్తా వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఒక వర్గానికో, కులానికో పరిమితమైన నాయకుడు కాదని అన్నారు. అణగారిన, పేద, బడుగు వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన గొప్ప వీరుడు, సామాజిక యోధుడని కొనియాడారు.

### మొఘల్ ఆధిపత్యాన్ని సవాల్ చేసిన ధీరుడు

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తన కాలంలో సామాన్య ప్రజలపై జరుగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా పోరాడారని, తనకంటూ సైన్యాన్ని సమీకరించి అన్యాయాన్ని ఎదుర్కొన్న ధీరుడిగా చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. అధికార బలానికి భయపడకుండా ప్రజల కోసం పోరాడిన ఆయన ధైర్యసాహసాలు, నాయకత్వ లక్షణాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.సమాజంలోని సబ్బండ వర్గాలకు సమానత్వం, సామాజిక న్యాయం అందాలనే లక్ష్యంతో పాపన్న గౌడ్ సాగించిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ఆయన వీరత్వం, ఆత్మగౌరవం, ప్రజా సంక్షేమం కోసం చూపిన సంకల్పం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన నిర్వాహకులు, స్థానిక కమిటీ సభ్యులను కూన శ్రీశైలం గౌడ్ అభినందించారు.ఈ కార్యక్రమంలో సర్దార్ పాపన్న గౌడ్ కమిటీ చైర్మన్ నందనం దివాకర్, అధ్యక్షులు గంగా శ్రీనివాస్ గౌడ్, మాజీ కార్పొరేటర్ విజయ శేఖర్ గౌడ్, ఆనంద్ గౌడ్, ప్రభా గౌడ్, జయశ్రీ, టీ. నర్సింగరావు గౌడ్, బుర్ర మణికంఠ గౌడ్, శ్యామనారాయణ గౌడ్, ప్రభు, సంతోష్, సురేష్ గౌడ్, భూషణం గౌడ్, సంజు గౌడ్, రాజు గౌడ్, లక్ష్మణ్ గౌడ్, అనిల్, శివతో పాటు గౌడ కుల పెద్దలు, స్థానిక నాయకులు, పలువురు ప్రముఖులు, కమిటీ సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళులు అర్పించారు.

## ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 30, తరంగాలు :
జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఉదయం 10.00 గంటల నుండి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా పరిధిలో జిల్లా స్థాయి అధికారులు రెవెన్యూ డివిజన్ పరిధిలో రెవెన్యూ డివిజన్ అధికారులు మండల స్థాయిలో మండల స్థాయి అధికారులు ప్రజావాణి నిర్వహిస్తారని, ఈ ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రకటన ద్వారా తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు



జాతీయ దిన పత్రిక
తరంగాలు
THARANGALU DAILY NEWS
సోమవారం, 31 ఆగస్టు , 2026


# వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే ఎవరు నాయిని అల్లుడా





- ఎమ్మెల్యే ఆంధ్రా అల్లుడికి వత్తాసు పలుకుతున్న హనుమకొండ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలి
- పండుగల స్వేచ్ఛను హరిస్తే సహించం
- ఒక పక్షానికే కొమ్ముకాస్తున్నారా? పోలీసులపై రావు పద్మ రెడ్డి ఆగ్రహం
- రాజకీయాలకు అతీతంగా ప్రతి హిందువు కోసం బిజెపి పోరాడుతుంది
- హిందూ పండుగలను అడ్డుకుంటే ఊరుకునేది లేదు
- హిందూ పండుగలపై ఆంక్షలా..? అర్ధరాత్రి అరెస్టులా..?
- ఇది ప్రజా పాలనా.. రాక్షస పాలనా..?
- హిందూ యువకుల అరెస్టులపై రావు పద్మ రెడ్డి ఫైర్

**హనుమకొండ ప్రతినిధి, ఆగస్టు 30,తరంగాలు** :వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే ఎవరు..? నాయిని రాజేందర్ రెడ్డి నా లేదా తన ఆంధ్రా అల్లుడా అని రావు పద్మ ప్రశ్నించారు.ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తమ పండుగలను స్వేచ్ఛగా జరుపుకునే రాజ్యాంగ హక్కు ఉంది. కానీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో హిందూ పండుగల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడమే కాకుండా, రాత్రికి రాత్రే అర్థరహితంగా అరెస్టులు చేయడం తీవ్రంగా ఖండించదగిన విషయం" అని బిజెపి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పోటీ చేసిన అభ్యర్థి రావు పద్మ రెడ్డి మండిపడ్డారు.అర్ధరాత్రి వేళల్లో తండ్రి దొరక్కపోతే కొడుకును, కొడుకు దొరక్కపోతే తండ్రిని అరెస్ట్ చేయడం ఏ రకమైన రాక్షస పాలనో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గానికి అసలు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారా? అని ప్రశ్నించారు. "ఎమ్మెల్యేను మేము గౌరవిస్తాం... కానీ ఎమ్మెల్యే ఆంధ్రా అల్లుడి పెత్తనం ఏంటి? ఆయన చెప్పారని హనుమకొండ సీఐ ఒక పక్షానికే కొమ్ము కాస్తూ, హిందూ యువకులను వేధిస్తూ నిరంకుశంగా ప్రవర్తించడం సరికాదు. ఎమ్మెల్యే అల్లుడికి వత్తాసు పలుకుతున్న హనుమకొండ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలి" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.హిందూ యువకులను అక్రమంగా అరెస్టు చేశారు అనే విషయం తెలుసుకున్న రావు పద్మ రెడ్డి, బిజెపి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ తో కలిసి హనుమకొండ పోలీస్ స్టేషన్‌కి చేరుకొని సీఐని ప్రశ్నించి పోలీసుల వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అక్రమంగా అరెస్టు చేసిన బన్నీ, బంటి, రాహుల్ లను అక్కడికక్కడే విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా రావు పద్మ రెడ్డి మాట్లాడుతూ... బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ అనీ రాజకీయాలకు అతీతంగా ప్రతి హిందువు హక్కుల కోసం, పండుగలను స్వేచ్ఛాయుత వాతావరణంలో జరుపుకోవడం కోసం తాము ఎప్పుడూ ముందుండి పోరాడతామని స్పష్టం చేశారు. ప్రశాంతంగా ఉండే వరంగల్ వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని, ఇలాంటి నిరంకుశ చర్యలు ఆపకపోతే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.




## నల్లతీగల కొమరయ్య కి నివాళులు



**జఫర్‌గఢ్ ప్రతినిధి, ఆగస్టు 30,(తరంగాలు):** మండల కేంద్రానికి చెందిన నవ తెలంగాణ రిపోర్టర్ నల్లతీగల వెంకటేశ్వర్లు తండ్రి నల్లతీగల కొమరయ్య ఇటీవల మృతి చెందగా, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, కొమరయ్య మృతికి సంతాపం తెలియజేసిన , మాజీ ఎమ్మెల్యే, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తాటికొండ రాజయ్య. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ కుమార్, మండల కన్వీనర్ పెంతలరాజకుమార్, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ నజీర్,శ్రీకాంత్ ఉపసర్పంచ్ మనోహర్,తదితరులు పాల్గొన్నారు.



## కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ పరీక్షా శిబిరానికి హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



- **పేదల ప్రాణాలు కాపాడేందుకు ముందస్తు క్యాన్సర్ నిర్ధారణే కీలకం**

జఫర్గడ్ ప్రతినిధి, ఆగష్టు 30,(తరంగాలు ):గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మండలంలోని తిడుగు గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ పరీక్షా శిబిరం కార్యక్రమానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హెల్త్ క్యాంప్‌లో అందుబాటులో ఉంచిన అత్యాధునిక క్యాన్సర్ నిర్ధారణ పరికరాలను వైద్య బృందంతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి నిశితంగా పరిశీలించారు. ఏయే రకాల క్యాన్సర్లను ఈ యంత్రాల ద్వారా ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చనే వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన స్థానిక గ్రామస్తులతో ఆయన ఆప్యాయంగా మాట్లాడారు. వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుని, ముందస్తు పరీక్షలతోనే మెరుగైన ఆరోగ్యం సాధ్యమని వారికి ధైర్యం చెప్పారు.?అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మారుతున్న ఆహారపు అలవాట్లు, యాంత్రికమైన జీవనశైలి వల్లే ప్రజలు అనేక కొత్త అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా సరైన అవగాహన లేకపోవడం, వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించలేకపోవడం వల్లే చాలా మంది పేదలు క్యాన్సర్ బారిన పడి అకాల మరణం చెందుతున్నారని అన్నారు. ఇలాంటి విషాదాలను నివారించాలంటే ప్రాథమిక స్థాయిలోనే క్యాన్సర్ లాంటి ప్రాణంతక వ్యాధులను గుర్తించేందుకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో అవసరం అని పేర్కొన్నారు. అన్ని రకాల క్యాన్సర్లను గుర్తించే అత్యాధునిక సదుపాయాలతో తిడుగు గ్రామంలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ వైద్య సేవలను కేవలం ఒక్క గ్రామానికే పరిమితం కాకుండా నియోజకవర్గం అంతటా విస్తరించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆకాంక్షించారు. ఇందులో భాగంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలోనూ త్వరలో ఒక భారీ మెగా హెల్త్ క్యాంప్ ను ఏర్పాటు చేయాలని కిమ్స్ ఆసుపత్రి వైద్య బృందాన్ని ఆయన కోరారు. దీని కోసం అవసరమైతే తానే స్వయంగా హైదరాబాద్ వెళ్లి కిమ్స్ ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడుతానని తెలిపారు. నియోజకవర్గ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని స్పష్టం చేశారు. హన్మకొండలో అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో 100పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతున్నాయని ఈ ఆసుపత్రులు త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. గ్రామ ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని గ్రామంలో ఇంత గొప్ప ఉచిత క్యాన్సర్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి విశేష కృషి చేసిన తిడుగు గ్రామ సర్పంచ్ సోమయ్య కి, అలాగే గ్రామీణ ప్రాంతానికి వచ్చి నిస్వార్థంగా వైద్య సేవలు అందిస్తున్న హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రి వైద్య బృందానికి, యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు.?ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సోమయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కిమ్స్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.




# దుండిగల్‌లో ఘనంగా పోచమ్మ తల్లి బోనాల పండుగ

### అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

దుండిగల్, ఆగస్టు 30, తరంగాలు : దుండిగల్ లో శ్రీ రాజరాజేశ్వర పోచమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపం టలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలు ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం అభినందనీ యమన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షులు ముత్యం రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, డివిజన్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, ప్రేమ్, ఉదయ్ గౌడ్ తదితర కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





THARANGALU DAILY NEWS
సోమవారం, 31 ఆగస్టు , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# తరంగాలు కథనానికి స్పందన

- పూల మొక్కల స్థానంలో ముళ్ల కంపలు!
- తరంగాలు కథనం వెలువడిన వెంటనే రంగంలోకి మున్సిపాలిటీ అధికారులు
- డివైడర్‌పై ముళ్ల చెట్లు,పిచ్చి మొక్కల తొలగింపుకు శ్రీకారం
- వర్ధన్నపేట--జఫర్గడ్ రోడ్డుపై ముళ్ల కంపలు, పిచ్చి మొక్కల తొలగింపు
- తరంగాలు కథనానికి అధికారుల స్పందనపై హర్షం
- సమస్య వెలుగులోకి రావడంతో చర్యలు చేపట్టడంపై స్థానికులు, వాహనదారుల ఆనందం

**వర్ధన్నపేట ప్రతినిధి , ఆగస్టు 30 (తరంగాలు ):** తరంగాలు కథనానికి వర్ధన్నపేట మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. వర్ధన్నపేట--జఫర్గడ్ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన డివైడర్‌పై పూల మొక్కల స్థానంలో ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు విచ్చలవిడిగా పెరిగి వాహనదారులకు ఇబ్బందికరంగా మారిన విషయం తెలిసిందే. డివైడర్ నిర్వహణపై శని వారం తరంగాలు జాతీయ దినపత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి మున్సిపాలిటీ అధికారులు స్పందించారు.వార్తా కథనం వెలువడిన వెంటనే అధికారులు డివైడర్‌ను పరిశీలించి, అక్కడ పెరిగిన ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలను తొలగించే పనులకు శ్రీకారం చుట్టారు. రహదారి మధ్యలోని డివైడర్‌పై పెరిగిన కంపలు, పొదలను తొలగిస్తూ పరిసరాలను శుభ్రం చేస్తున్నారు.ప్రధాన రహదారి కావడంతో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. డివైడర్‌పై పెరిగిన ముళ్ల కంపలు, పిచ్చి మొక్కల కారణంగా రహదారి అందం దెబ్బతినడంతో పాటు, వాహనదారుల దృష్టికి కూడా ఇబ్బంది కలిగించే పరిస్థితి నెలకొంది.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన తరంగాలు కథనానికి అధికారులు స్పందించి చర్యలు చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డివైడర్‌పై మళ్లీ పూల మొక్కలు, అలంకార మొక్కలు నాటి, వాటిని నిరంతరం పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.తరంగాలు కథనానికి స్పందించి వెంటనే చర్యలు చేపట్టిన మున్సిపాలిటీ అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.


తరంగాలు

## పూల మొక్కల స్థానంలో ముళ్లకంపలు

- ఇదేనా డివైడర్ సుందరీకరణ?
- వర్ధన్నపేట--జఫర్గడ్ రహదారిపై ప్రమాదకరంగా పెరిగిన పిచ్చి మొక్కలు..
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు!

**వర్ధన్నపేట ప్రతినిధి , ఆగస్టు 28,(తరంగాలు):** వాహనదారులకు ఆహ్లాదకరమైన ప్రయాణాన్ని అందించాల్సిన రహదారి డివైడర్లు ప్రస్తుతం పిచ్చి మొక్కలు, ముళ్లకంపలు, పొదలకు నిలయాలుగా మారాయి. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని జఫర్గడ్ వెళ్లే ప్రధాన రహదారిపై నిర్మించిన డివైడర్లలో పూల మొక్కలు, అందమైన మొక్కల స్థానంలో విచ్చలవిడిగా పెరిగిన ముళ్ల చెట్లు దర్శనమిస్తున్నాయి.అందం కోసం నిర్మించిన డివైడర్లు.. ప్రమాదాలకు అడ్డాలుగా మారుతున్నాయా?రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్లను పట్టణ సుందరీకరణలో భాగంగా పూల మొక్కలు, అలంకార మొక్కలతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాల్సి ఉండగా. నిర్వహణ లోపంతో అవి పిచ్చి మొక్కలకు నిలయాలుగా మారుతున్నాయి. కొమ్మలు రోడ్డువైపు విస్తరించి వాహనదారులకు తగులుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు వచ్చే వాహనాలకు దూరంగా వెళ్లే క్రమంలో డివైడర్ వైపు వెళ్లాల్సి వచ్చినప్పుడు ముళ్లకంపలు, పొదల కొమ్మలు తగిలే ప్రమాదం ఉందని చెబుతున్నారు. వాటిని తప్పించుకునే ప్రయత్నంలో వాహనాల అదుపు తప్పి కిందపడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

ఫొటోలకు సుందరం.. నిర్వహణలో మాత్రం శూన్యం!
డివైడర్లు నిర్మించిన సమయంలో పట్టణ సుందరీకరణకు పెద్దపీట వేస్తామని చెప్పినా, ప్రస్తుతం పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాదు.. వాటి సంరక్షణ, క్రమం తప్పకుండా కత్తిరించడం కూడా అధికారుల బాధ్యతే అని పట్టణ ప్రజలు అంటున్నారు.
పెరిగిపోయిన ముళ్లకంపలు రహదారిపైకి విస్తరించడంతో వాహనదారుల దృష్టికి అటంకం కలగడమే కాకుండా, రాత్రి వేళల్లో మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

అధికారులు స్పందించాలి.. ప్రమాదం జరిగే వరకు వేచి చూడొద్దు!
ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి డివైడర్లలో పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్లకంపలను వెంటనే తొలగించాలని, రహదారిపైకి విస్తరించిన కొమ్మలను కత్తిరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అనంతరం డివైడర్లలో తగిన పూలు, అలంకార మొక్కలను నాటి నిరంతర నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు."ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే.. ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొనాలి" అంటూ వర్ధన్నపేట ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

epaper.tharangalu.com | 29 Aug, 2026 | Page: 4 | Clip ID: C-745393
For more details, visit epaper.tharangalu.com



# రోజూ పరగడుపునే 30 రోజుల పాటు కొబ్బరినీళ్లను తాగితే కలిగే లాభాలు ఇవే..!



నిద్ర లేచిన తరువాత కొందరు నీరు తాగుతూ ఉంటారు. కొందరు టీ లేదా కాఫీ తాగుతారు. అయితే నీరు లేదా కెఫిన్ కు బదులుగా కొబ్బరి నీరు తాగితే ఏమవుతుందో మీకు తెలుసా. ఉదయం నిద్ర లేచిన తరువాత శరీరం డీహైడ్రేటెడ్ గా ఉంటుంది. కొబ్బరినీళ్లల్లో పొటాషియం, మెగ్నీషియం వంటి ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. కనుక శరీరం త్వరగా హైడ్రేట్ అవుతుంది. దీంతో శరీరంలో ద్రవ్య సమతుల్యత మెరుగుపడుతుంది. ఉదయం పూట కొబ్బరి నీరు తాగడం వల్ల అలసట తక్కువగా ఉంటుందని కూడా వైద్యులు చెబుతున్నారు. అలాగే కొబ్బరి నీరు పొట్టకు తేలికగా ఉంటుంది. ఉదయం తీసుకోవడం వల్ల ఒత్తిడి లేకుండా జీర్ణవ్యవస్థను మేల్కొలపడానికి ఇది సహాయపడుతుంది. ఉబ్బరం తక్కువగా ఉండడంతో పాటు ప్రేగు కదలికలు ఎక్కువగా ఉంటాయి. అదే విధంగా కొబ్బరి నీరు కణాల హైడ్రేషన్ ను ప్రోత్సహిస్తుంది. ఆక్సిజన్, పోషకాలు శరీరమంతా సమర్థవంతంగా సరఫరా కావడంలో సహాయపడుతుంది. దీని వల్ల శక్తి రోజంతా స్థిరంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

### చర్మం, జుట్టు ఆరోగ్యానికి..

కొబ్బరి నీరు సహజంగానే పొటాషియంను ఎక్కువగా కలిగి ఉంటుంది. ఇది సోడియం స్థాయిలను సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. కాలక్రమేణా రక్తపోటు స్థాయిలు పెరగకుండా ఇది సహాయపడుతుంది. పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినని వారు కొబ్బరి నీరు తాగడం వల్ల శరీరానికి తగినంత పొటాషియం అంది రక్తపోటు స్థాయిలు పెరగకుండా ఉంటాయి. కొబ్బరి నీరు తాగడం వల్ల శరీరం హైడ్రేటెడ్ గా ఉండడంతో పాటు ఖనిజాలు కూడా ఎక్కువగా అందుతాయి. దీంతో చర్మం, జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుంది. చర్మం, పెదవులు పొడిబారడం వంటి సమస్యలు తగ్గుతాయి. కొబ్బరినీరు తాగడం వల్ల బరువు తగ్గవచ్చా వంటి సందేహాలు కూడా చాలా మందికి వస్తూ ఉంటాయి. అయితే ఇది స్వయంగా కొవ్వును కరిగించదని కానీ కొబ్బరి నీటిని తాగడం వల్ల ఉదయం అల్పాహారం తీసుకునే మోతాదు తగ్గడంతో పాటు చక్కెర పానీయాలు తీసుకోవాలనే కోరిక కూడా తగ్గుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. కొబ్బరి నీటిని తాగడం వల్ల హైడ్రేషన్ మెరుగుపడుతుంది. దీంతో ఆకలి సంకేతాలు పరోక్షంగా మారుతాయి. దీంతో చక్కటి సమతుల్య ఆహారాన్ని ఎంచుకునే వీలు ఉంటుంది.

### మితంగానే తీసుకోవాలి..

కొబ్బరి నీరు ఆరోగ్యానికి మంచివే అయినప్పటికీ వీటిని కూడా మితంగానే తీసుకోవాలి. ఎక్కువ పొటాషియం స్థాయిలతో బాధపడే వారు మూత్రపిండాల సమస్యలతో బాధపడే వారు, డయాబెటిస్ తో బాధపడే వారు ఈ నీటిని తీసుకునే విషయంలో జాగ్రత్తగా ఉండడం చాలా అవసరం. రోజూ ఒక గ్లాస్ ( 200 -- 250 ఎమ్ఎల్) మోతాదులో మాత్రమే తీసుకోవాలి.

# మాసాని మారియా కుటుంబానికి కాంగ్రెస్ నేతల పరామర్శ



పర్వతగిరి , ఆగస్టు 30, తరంగాలు : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామంలో ఇటీవల మృతి చెందిన మాసాని యాకూబ్ సతీమణి మాసాని మారియా కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు.మాసాని మారియా చిత్రపటానికి రావూరు మాజీ సర్పంచ్ నోముల రమేష్ యాదవ్, గ్రామ మాజీ అధ్యక్షుడు ఆబర్ల రవి, రావూరు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బండి రమేష్ గౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. మాసాని మారియా మృతి పట్ల తమ ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# ఎక్కువ వాల్యూమ్‌తో సంగీతం వింటున్నారా..? అయితే జాగ్రత్త..!

అధిక శాతం మంది ఎక్కువ శబ్దంతో సంగీతాన్ని వింటూ ఉంటారు. అలాగే శుభ కార్యాల్లో ఎక్కువ శబ్దంతో పాటలు వింటూ డ్యాన్స్ చేస్తూ ఉంటారు. అయితే ఇలా భారీ శబ్దాలతో సంగీతం వినడం హానికరమని నిపుణులు చెబుతున్నారు. అధిక శబ్దాలతో సంగీతం వినడం వల్ల చిన్న వయస్సులోనే తిరిగి సరిచేయలేని వినికిడి నష్టం కలుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువ శబ్దంతో సంగీతం వినడం వల్ల వినికిడి శక్తి తగ్గడం నెమ్మదిగా ప్రారంభమవుతుంది. దీనిని ప్రారంభ దశలో చాలా మంది గుర్తించలేరు. అయితే ఈ నష్టం తిరిగి సరిచేయలేనిదని కనుక ముందు జాగ్రత్త అవసరమని నిపుణులు తెలియజేస్తున్నారు. వినికిడి నష్టం కలగకుండా ఉండాలంటే హెడ్ ఫోన్ వంటి వ్యక్తిగత ఆడియో పరికరాలను 60 శాతం కంటే తక్కువ వాల్యూమ్ తో ఉపయోగించాలి.

### విరామం తీసుకోవడం ముఖ్యం..

అలాగే ఒక గంట ఉపయోగించిన తరువాత విరామం తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. ఎంత ఎక్కువ శబ్దంతో సంగీతాన్ని వింటే తీసుకునే విరామ సమయం కూడా అంతే ఎక్కువగా ఉండాలని అప్పుడే వినికిడి నష్టం తగ్గుతుందని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా యువత అధిక శబ్దంతో సంగీతాన్ని వింటూ ఉంటారని దీని వల్ల వినికిడి నష్టం ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని వినికిడి నష్టం పట్ల జాగ్రత్తగా ఉండాలని నిపుణులు తెలియజేస్తున్నారు.

# జంక్ ఫుడ్ తీసుకోవడం అంటే పొగతాగడంతో సమానమే..

- **హార్వర్డ్ అధ్యయనంలో వెల్లడి..**

ప్రజారోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతున్న అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్స్ ను సిగరెట్ల మాదిరిగానే కఠినంగా నియంత్రించాలని తాజా అకడమిక్ అధ్యయనం సూచించింది. హార్వర్డ్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ మిషిగన్, డ్యూక్ యూనివర్సిటీలకు చెందిన పరిశోధకులు సంయుక్తంగా నిర్వహించిన ఈ అధ్యయనం తాలూకు వివరాలను ఇటీవలే ఆరోగ్య రంగానికి చెందిన ప్రతిష్ఠాత్మక జర్నల్ ది మిల్‌బ్యాంక్ క్వార్టర్లీలో ప్రచురించారు. ఈ అధ్యయనం ప్రకారం అల్ట్రా-ప్రాసెస్డ్ ఫుడ్స్, పొగాకు ఉత్పత్తుల మధ్య ఆశ్చర్యకరమైన పోలికలు ఉన్నట్లు గుర్తించారు. సాఫ్ట్ డ్రింక్స్, ప్యాకేజ్డ్ స్నాక్స్, బిస్కెట్లు, చిప్స్ వంటి పారిశ్రామికంగా తయారయ్యే ఆహారాలు కృత్రిమ రుచులు, రంగులు, ఎమల్సిఫైయర్లు, ప్రిజర్వేటివ్‌లతో నిండి ఉంటాయని పరిశోధకులు తెలిపారు. ఇవి ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా వినియోగంలో ఉన్నాయని హెచ్చరించారు.

### ఉద్దేశపూర్వకంగా UPFs డిజైన్..

పొగాకు ఉత్పత్తుల మాదిరిగానే UPFsను కూడా మళ్లీ మళ్లీ తినేలా ఉద్దేశపూర్వకంగా డిజైన్ చేస్తున్నారని అధ్యయనం పేర్కొంది. రుచి, ఆకారం, రంగు ఆకర్షణీయంగా ఉండేలా పలు రసాయన సమ్మేళనాలను ఉపయోగించి ఆయా పదార్థాలను తయారు చేస్తున్నారని తేల్చారు. ఇవి మెదడులోని పలు భాగాలను ఉత్తేజ పరుస్తాయని, దీంతో ఆయా ఆహారాలను తినాలనే కోరిక లేదా, అలవాటు పెరుగుతుందని అన్నారు. ఈ క్రమంలోనే UPFsను ప్రజలు అధికంగా తీసుకుంటున్నారని తెలిపారు. వారు అలా వాటిని అధికంగా తీసుకునేలా తయారీదారులు వాటిని తయారు చేస్తున్నారని పరిశోధకులు విశ్లేషించారు. కాగా మార్కెటింగ్ విధానాలపైనా ఈ అధ్యయనం తీవ్ర విమర్శలు చేసింది.

### UPFs పై నియంత్రణ అవసరం..

ఈ అధ్యయనానికి సహ రచయిత, యూనివర్సిటీ ఆఫ్ మిషిగన్ ప్రొఫెసర్ అయిన ఆష్లే గేర్‌హార్డ్ తన రోగులు ఆహార కోరికలను నికోటిన్ వ్యసనంతో పోల్చుతూ వివరిస్తారని తెలిపారు. కొందరు మాజీ ధూమపాన ప్రియులు సిగరెట్లను మానేసిన తర్వాత ఫిజీ డ్రింక్స్, చక్కెర అధికంగా ఉండే స్నాక్స్‌కు అలవాటు పడినట్లు చెప్పారని ఆమె వెల్లడించారు. ఆహారం జీవనానికి అవసరం, పొగాకు అవసరం కాదు.



ఎవరు..?
EVARU..?
ప్రశ్న ప్రజలది.. సమాధానం మా అన్వేషణ
వార్తలు
విశ్లేషణ
గ్రౌండ్ రిపోర్ట్
ప్రజల గొంతుక
ప్రత్యేక కథనాలు
ఫ్యాక్ట్ చెక్
ఎవరు..?
EVARU..?
ప్రశ్న ప్రజలది..
సమాధానం మా అన్వేషణ
ఎవరు..?
@evaruofficial
ప్రశ్న ప్రజలది.. సమాధానం మా అన్వేషణ
SUBSCRIBE
చానల్ ఇంట్రో (Intro)
ఎవరు..?
ఎవరు..? ఏం జరిగింది..? ఎందుకు జరిగింది..?
అసలు నిజం ఏమిటి..?
ప్రజల ప్రశ్నలకు సమాధానం వెతుకుతూ..
వార్త వెనుక ఉన్న వాస్తవాన్ని
మీ ముందుకు తీసుకొచ్చే వేదిక..
ఎవరు..?
ప్రశ్న ప్రజలది.. సమాధానం మా అన్వేషణ.
మా కంటెంట్ సెగ్మెంట్లు
01 ఎవరు..? స్పెషల్
ప్రముఖులు, ప్రభావశీల వ్యక్తుల పూర్తి పరిచయం
02 ఎవరు..? ఎందుకు..?
ఒక సంఘటన వెనుక కారణాలు
03 ఎవరు..? గ్రౌండ్ రిపోర్ట్
క్షేత్ర స్థాయి నుండి నేరుగా కథనాలు
04 ఎవరు..? ప్రజల ప్రశ్న
ప్రజలు అడిగే ప్రశ్నలు – మా వేదికపై
05 ఎవరు..? ఫ్యాక్ట్ చెక్
వైరల్ వార్తల్లో నిజమెంత?
06 ఎవరు..? 60 సెకండ్స్
తాజా వార్తలు – 60 సెకండ్లలో
07 ఎవరు..? ప్రత్యేక కథనం
లోతైన విశ్లేషణతో ప్రత్యేక కథనాలు
ఎందుకు ఎవరు..? సబ్‌స్క్రైబ్ చేయాలి?
నిజాన్ని తెలుసుకోవడానికి
ప్రజల సమస్యలను మీ ముందుకు తీసుకురావడానికి
వాస్తవాల ఆధారంగా నమ్మకమైన సమాచారానికి
నిర్భయంగా.. నిజాయితీగా..
మీ మద్దతే మా బలము
ప్రశ్నిద్దాం.. తెలుసుకుందాం.. మార్పు తీసుకురాందాం..!
Who...?...?
NEWS
ఎవరు?
YouTube CHANNEL TV
ప్రశ్న ప్రజలది... సమాధానం మా అన్వేషణ